సాక్షి అనకాపల్లి

శుక్రవారం । 1 । సెప్టెంబర్ । 2023



క్రికెటర్ ఈశ్వర్ ఇకలేరు

క్రికెట్ ఆశగా.. శ్వాసగా బతికిన ఈశ్వర్ గుండెపోటుతో కన్నుమూశారు. ఆయన సచిన్, కోహ్లీ వంటి దిగ్గజాలకు సుపరిచితుడు. 8లో



కనకమ్మకు తులసి పూజ

విశాఖ: కనకమహాలక్ష్మి ఆలయంలో గురువారం ఘనంగా సహస్ర తులసి పూజ నిర్వహించారు.



హెచ్‌పీసీఎల్ హరిత హారం

విశాఖ: హెచ్‌పీసీఎల్ గోల్డెన్ జూబ్లీ వేడుకల సందర్భంగా అధికారులు గురువారం 2 వేల మొక్కలను నాటారు.

న్యూస్‌రీల్

8న విశాఖలో గవర్నర్ పర్యటన



సాక్షి, విశాఖపట్నం : రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ నగరంలో పర్యటించనున్నారు. ఈ నెల 8వ తేదీన విశాఖకు చేరుకోనున్నారు. 9న జరిగే సమాచార కమిషనర్ల సదస్సుకు గవర్నర్ అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా హాజరవుతారు. మూడు రోజుల పాటు జరిగే సదస్సును గవర్నర్ ప్రారంభించనున్నారు. అదేవిధంగా ఆంధ్ర విశ్వవిద్యాలయంలో జరిగే పలుకార్యక్రమాలతో పాటు నగరంలో జరిగే పలు కార్యక్రమాల్లో గవర్నర్ హాజరుకానున్నారు. 11వ తేదీన అబ్దుల్ నజీర్ తిరుగు ప్రయాణం కానున్నారని కలెక్టరేట్ వర్గాలు వెల్లడించాయి.

తాండవ కాలువల అభివృద్ధికి రూ.65 లక్షలు మంజూరు

నాతవరం: తాండవ రిజర్వాయర్ పరిధిలో ప్రధాన కాలువలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం రూ.65 లక్షల నిధులు మంజూరు చేసినట్లు ఇరిగేషన్‌శాఖ ఇన్‌చార్జి ఈఈ జె.స్వామినాయుడు తెలిపారు. గురువారం ఆయన జలాశయ జేఈలతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నిధులతో తాండవ ప్రాజెక్టు ప్రధాన కాలువలతో పాటు శిథిలమైన కల్వర్టులు, స్లూయిజ్‌లు, అక్విడెక్ట్‌ల మరమ్మతులను చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే నాలుగు పనులకు టెండర్ల ప్రక్రియ పూర్తికాగా, మిగిలినవి టెండర్ల దశలో ఉన్నట్లు తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో ఆయకట్టుకు నీటి సరఫరా పూర్తయ్యాక పనుల్ని చేపట్టనున్నట్లు వెల్లడించారు. ప్రాజెక్టు మెయిన్ కాలువలు, పిల్ల కాలువలు కలిపి అనకాపల్లి, కాకినాడ జిల్లాల పరిధిలో 120 కిలో మీటర్లు పొడవున ఉన్నాయని, ప్రభుత్వ నిధులతో వీటిని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. ప్రాజెక్టు జేఈలు శ్యామ్‌కుమార్, వినయ్‌కుమార్, రామకృష్ణ, పాత్రుడు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు నాగబాబు, అప్పారావు, అప్పలనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

మాకవరపాలెం: మండలంలోని మల్లవరం గ్రామంలో జరుగుతున్న బాల్య వివాహాన్ని ఐసీడీఎస్ అధికారులు అడ్డుకున్నారు. ఈ గ్రామంలోని 15 ఏళ్ల వయసు బాలికకు వివాహం జరుగుతున్నట్టు అందిన సమాచారంతో ఐసీడీఎస్ సీడీపీవో మేరీ సువార్త పోలీసులతో గురువారం గ్రామానికి చేరుకున్నారు. బాలిక తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. బాల్య వివాహాలు చేస్తే ఎదురయ్యే ఇబ్బందులు, చర్యలపై వివరించారు. నిబంధనలకు విరుద్ధంగా వివాహం చేస్తే శిక్షార్హులని స్పష్టం చేశారు.

మహిళా ఎస్‌ఐ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు




లాంగ్ జంప్ చేస్తున్న మహిళా అభ్యర్థి

ఆరిలోవ: విశాఖ రేంజ్ పరిధిలో ఎస్.ఐ నియామకాలు కోసం మహిళా అభ్యర్థులకు నిర్వహిస్తోన్న దేహదారుఢ్య పరీక్షలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. పరుగు, లాంగ్ జంప్ తదితర పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. రెండో రోజు జరిగిన ఈ పోటీలు కోసం 685 మందికి హాల్ టికెట్లు పంపగా 539 మంది హాజరయ్యారు. రేంజ్ డీఐజీ ఎస్.హరికృష్ణ సమక్షంలో జరిగిన ఈ పోటీలు జరిగాయి.

గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తుల ఆహ్వానం

విశాఖ విద్య: జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఖాళీగా ఉన్న సబ్జెక్టు అధ్యాపకుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్న జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి రాయల సత్యనారాయణ తెలిపారు. జనరల్ సబ్జెక్టులు తెలుగు-1(ఆనందపురం), భౌతిక శాస్త్రం-1(అగనంపూడి), అదే విధంగా ఒకేషనల్ కోర్సుల్లో జీఎఫ్‌సీ (ఎకనామిక్స్) -1 (డాక్టర్ వీఎస్ కృష్ణ ఒకేషనల్ కాలేజీ)పోస్టు ఖాళీగా ఉందన్నారు. సంబంధిత సబ్జెక్టుల్లో 50 శాతం మార్కులతో పోస్టు గ్రాడ్యుయేషన్ విద్యార్హత కలిగి ఉన్న వారు అర్హులన్నారు. రిటైర్డ్ అధ్యాపకులు, స్కూల్ అసిస్టెంట్లు కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అర్హత గల ఆసక్తి ఉన్న అభ్యర్థులు శుక్రవారం సాయంత్రంలోగా విశాఖపట్నం పిఠాపురం కాలనీలోని డీవీఈవో కార్యాలయంలో తగిన ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తులు అందజేయాలన్నారు.

ఆపన్నులకు పింఛన్ భరోసా



దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేనన్ని సంక్షేమ పథకాలు.. ఇచ్చిన మాట ప్రకారం ఏటా పెంచుతున్న పింఛన్.. ఆపన్నులకు నేనున్నానన్న భరోసా. ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్ పాలన. ఇపుడు మరి కొందరి జీవితాలకు భరోసానిచ్చింది. జిల్లాలో అర్హులైన 4,896 మందికి కొత్త పింఛన్లను మంజూరు చేసింది.

- కొత్తగా 4,896 మందికి పింఛన్లు
- నేటి నుంచి పంపిణీకి ఏర్పాట్లు



చోడవరం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పింఛన్ పంపిణీలో తరతమ భేదాలు చూడట్లేదు. ఏటా రెండుసార్లు అర్హులను పింఛన్లకు ఎంపిక చేస్తోంది. రూ.2,750 నుంచి రూ.10 వేల వరకూ వివిధ కేటగిరీల వారీగా అర్హులను గుర్తించి, పింఛన్ల లబ్ధి చేకూర్చుతోంది. భారీ స్థాయిలో పింఛన్లు అందిస్తూ అభాగ్యులకు ఆసరాగా ఉండటమే కాకుండా, ఇతర రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదర్శంగా నిలుస్తోంది.

4,896 మందికి కొత్త పింఛన్లు

అనకాపల్లి జిల్లాలోని 27 మండలాల్లో కొత్తగా మరో 4,896 మంది కొత్త పింఛన్లకు అర్హులుగా తేలారు. ఇప్పటి వరకు జిల్లాలో 2 లక్షల 58 వేల 242 మంది పింఛన్‌దారులు ఉండగా, కొత్తగా మంజూరైన పింఛన్లతో ఈ సంఖ్య 2 లక్షల 63 వేల 138 మందికి చేరింది. గత నెల వరకూ పింఛన్‌దారులకు రూ.69 కోట్ల 79 లక్షల 92 వేల 500 నగదును ప్రభుత్వం అందించేది. ఇపుడు ఆ మొత్తం రూ.72 కోట్ల 23 లక్షలకు చేరింది. వీరందరికీ సెప్టెంబరు నెల నుంచి పింఛన్ అందించేందుకు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే ప్రభుత్వం పింఛన్ నిధులు విడుదల చేయడంతో పాత, కొత్త పింఛన్ దారులందరికీ శుక్రవారం నుంచి పింఛన్ల పంపిణీ చేయనున్నారు.

మాట నిలబెట్టుకున్న సీఎం

ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం అర్హతే కొలమానంగా పింఛన్లు, సంక్షేమ పథకాలు అందిస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఆ మాట నిలబెట్టుకున్నారు. ఎవరికీ ఒక్క రూపాయి లంచం ఇవ్వకుండా అర్హత ఉంటే వలంటీరే ఇంటికి వెళ్లి మరీ పింఛన్లకు దరఖాస్తు చేయించి మంజూరు చేయించారు.

ఎప్పటికప్పుడు అర్హులను గుర్తిస్తున్నాం



అర్హత ఉంటే చాలు పింఛన్ ఇస్తున్నాం. ఎప్పటికప్పుడు సచివాలయాల ద్వారా వలంటీర్లు పింఛన్ అర్హుల జాబితాను అప్‌లోడ్ చేస్తున్నారు. వాటిని ప్రభుత్వం మంజూరు చేసిన వెంటనే లబ్ధిదారులకు అందిస్తున్నారు. రూ.2750, రూ.3 వేలు, రూ.5 వేలు, రూ.10 వేలు చొప్పున వివిధ కేటగిరిల్లో లబ్ధిదారులకు పింఛన్లు ఇస్తున్నాం. కొత్తగా పింఛన్ మంజూరైన వారికి పింఛన్ పాసుపుస్తకంతోపాటు, పెన్షన్ ఐడీ కార్డుల్ని కూడా పంపిణీ చేయనున్నాం.

– బి.లక్ష్మీపతి, పీడీ, డీఆర్‌డీఏ, అనకాపల్లి

గత టీడీపీ హయాంలో ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ, కాళ్లు అరిగేలా తిరిగి, జన్మభూమి కమిటీల సిఫారసు, ముడుపులు చెల్లించుకుంటే తప్ప పింఛన్‌కు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండేది కాదు. ఇపుడు ఆ తిప్పలేవీ లేవు. నేరుగా వలంటీర్లే అర్హుల్ని గుర్తించి, పింఛన్ కానుక మంజూరయ్యేలా కృషి చేస్తున్నారు.

మండలాల వారీగా కొత్త పింఛన్లు

మండలం	పింఛన్లు	అచ్యుతాపురం	200	కోటవురట్ల	146
అనకాపల్లి రూరల్	293	నాతవరం	194	పరవాడ	143
అనకాపల్లి అర్బన్	224	సబ్బవరం	181	వి.మాడుగుల	136
పాయకరావుపేట	288	గొలుగొండ	180	మునగపాక	134
రావికమతం	269	కశింకోట	180	దేవరాపల్లి	133
చోడవరం	255	నర్సీపట్నం		చీడికాడ	104
మాకవరపాలెం	240	మున్సిపాలిటీ	168	యలమంచిలి	
నక్కపల్లి	224	నర్సీపట్నం రూరల్	134	మున్సిపాలిటీ	99
ఎస్.రాయవరం	211	రోలుగుంట	153	యలమంచిలి	
బుచ్చెయ్యపేట	201	రాంబిల్లి	151	రూరల్	92

కౌలు రైతులకు రైతు భరోసా జమ నేడు

1904 మందికి రూ.1.42 కోట్ల లబ్ధి

తుమ్మపాల: కౌలు, దేవాదాయ శాఖ భూముల సాగు రైతులకు ఐదో ఏడాది మొదటి విడతలో భాగంగా శుక్రవారం నిధులు జమ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో బటన్ నొక్కి అర్హులైన కౌలు రైతుల బ్యాంక్ ఖాతాలకు నిధుల్ని జమ చేయనున్నారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ కార్యాయాలలో కలెక్టర్, అధికారులు, పాలకులు, కౌలురైతులు వీక్షించనున్నారు. అనంతరం లబ్ధిదారులకు చెల్లించాల్సిన మొత్తాన్ని చెక్కు రూపంలో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి రైతులకు అందించనున్నారు. ఈ మేరకు జిల్లాలోని అన్ని రైతు భరోసా కేంద్రాలలో కార్యక్రమాన్ని రైతులు వీక్షించేందుకు వ్యవసాయ శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు.

ఐదో ఏడాది రూ.1.42 కోట్లు

కౌలు రైతులకు వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద ఐదవ ఏడాది మొదటి విడత ఆర్థిక సహాయంగా ఒకొక్కరికి రూ.7,500 నగదును వారి బ్యాంకు ఖాతాలలో జమ చేయనుంది. జిల్లాలో 1,904 మంది కౌలు రైతులను అర్హులుగా గుర్తించారు. వారికి రూ. కోటీ 42 లక్షల, 80 వేలు అందించనున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహనరావు తెలిపారు.

ప్రయాణికుల సౌకర్యార్థం మరో విస్టాడోమ్ కోచ్

తాటిచెట్లపాలెం (విశాఖ): ఎక్కువ మంది ప్రయాణికుల అరకు అందాలను వీక్షించేందుకు వీలుగా ప్రయాణికుల సౌకర్యార్థం మరో విస్టాడోమ్ కోచ్‌ను తాత్కాలికంగా జత చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు.

విశాఖపట్నం-కిరండూల్(08551) పాసింజర్ స్పెషల్‌కు సెప్టెంబరు 2, 3 తేదీలలో, కిరండూల్-విశాఖపట్నం(08552) పాసింజర్ స్పెషల్‌కు సెప్టెంబరు 3,4 తేదీలలో అదనపు విస్టాడోమ్ కోచ్‌ను జతచే స్తున్నారు.

సత్వర వైద్యంతో ప్రభుత్వానికి మంచిపేరు

వైద్య సిబ్బందికి ఎంపీ సత్యవతి సూచన



ఆస్పత్రిని పరిశీలిస్తున్న ఎంపీ సత్యవతి

అనకాపల్లిటౌన్: నాడు-నేడు పథకంలో దశల వారీగా ప్రభుత్వ ఆస్పత్రులను అభివృద్ధి చేసి, అనారోగ్యంతో ఆస్పత్రికి వచ్చే రోగులకు సకాలంలో మెరుగైన వైద్య సేవలందించేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని ఎంపీ బీవీ సత్యవతి అన్నారు. స్థానిక కోట్నివీధి(గొల్ల వీధి) అర్బన్ హెల్త్ సెంటర్‌ను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాతావరణంలో మార్పుల కారణంగా వివిధ రకాలైన వ్యాధులతో ఆసుపత్రికి వచ్చే రోగులకు సత్వర వైద్యసేవలు అందించాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చేవారు బడుగు, బలహీన వర్గాలకు చెందినవారేనని, వారికి సకాలంలో వైద్యం అందించి, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు, వైద్యుడు కాండ్రేగుల విష్ణుమూర్తి, పార్టీ 84వ వార్డు ఇన్‌చార్జి కోరుకొండ రాఘవ, వైద్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో ప్రసవాలు పెరగాలి

- గర్భిణులకు ప్రభుత్వ సేవలపై మరింత అవగాహన
- డీఎంహెచ్‌వో డాక్టర్ హేమంత్ ఆదేశం



అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలు, గర్భిణులు, పిల్లల డేటా పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

కశింకోట: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాల సంఖ్య పెరగాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి హేమంత్ ఆదేశించారు. తాళ్లపాలెం పీహెచ్‌సీని గురువారం ఆయన పరిశీలించారు. పీహెచ్‌సీలో ఈ నెలలో నాలుగు ప్రసవాలు అయినట్టు తెలుసుకొని, మరింత పెరగాలని చెప్పారు. రెండో ప్రసవానికి కూడా గర్భిణులను పీహెచ్‌సీలకు తీసుకురావడానికి సిబ్బంది కృషి చేయాలన్నారు. వైద్య సేవల గురించి ఓపీకి వచ్చిన రోగులను అడిగి తెలుసుకున్నారు. రక్త పరీక్షలు, ఆస్పత్రి నిర్వహణ తీరును, రికార్డులను పరిశీలించారు. క్షయ వ్యాధి అనుమానితులు ఉంటే వారికి సేవలందించడం పట్ల దృష్టి సారించాలన్నారు. ఆశ కార్యకర్తలకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు. గర్భిణులకు ప్రభుత్వం నుంచి అందుతున్న వైద్య సేవలు, సదుపాయాల గురించి ఇంటింటికీ వెళ్లి ఆశ కార్యకర్తలు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం నరసింగబిల్లిలో కంటి వెలుగు కార్యక్రమాన్ని పరిశీలించారు. హైస్కూలును సందర్శించి రక్త హీనత ఉన్న విద్యార్థుల గురించి ఆరా తీశారు. వీరి పట్ల ఆరోగ్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.

పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి అక్కడ పిల్లల ఆరోగ్య పరిస్థితి, వారికి అందుతున్న సేవలపై ఆరా తీశారు. వైద్యాధికారి రమేష్, పీహెచ్‌సీ ఆరోగ్య సిబ్బంది నాగలక్ష్మి, ఉమ, శంకరరావు పాల్గొన్నారు.

తగిన ఆధారాలతోనే ఓట్ల తొలగింపు

మరణించిన వారి ఇళ్లకు వెళ్లి ఆరా తీసిన కలెక్టర్



నక్కపల్లి: దేవవరంలో తొలగించిన ఓటరు ఇంటికి వెళ్లి ఆరా తీస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



ఎస్.రాయవరం: అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో మాట్లాడుతున్న కలెక్టర్

నక్కపల్లి: ఎటువంటి ఆధారాలు లేకుండా మరణించిన వారి, వలసలు వెళ్లిన వారి ఓట్లు తొలగించవద్దని జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన దేవవరంలో ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఇటీవల కాలంలో అధికారులు తొలగించిన ఓటర్ల ఇళ్లకు వెళ్లి పరిశీలించారు. గ్రామానికి చెందిన కన్నే జాషువా గత ఏడాది మరణించడంతో అధికారులు అతని ఓటు తొలగించారు. కలెక్టర్ జాషువా ఇంటికి వెళ్లి ఆరా తీశారు. మరణం వాస్తవమేనా అని కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఇలా గ్రామంలో మరో ముగ్గురు ఇళ్లకు వెళ్లి క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. అనంతరం ఆయన రెవెన్యూ సిబ్బంది, బీఎల్‌వోలను ఉద్దేశించి మాట్లాడుతూ మరణించిన వారి ఓట్లు తొలగించే ముందు మరణ ధ్రువపత్రాలు సేకరించాలన్నారు. అవి అందుబాటులో లేకపోతే గ్రామ పెద్దల నుంచి పంచనామా తీసుకోవాలన్నారు. అన్ని రాజకీయ పార్టీ నేతల ఆమోదంతోనే ఓట్లు తొలగించాలన్నారు. అనంతరం ఆయన సచివాలయం, ఆర్బీకేలను సందర్శించారు. దేవవరంలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీకి రోడ్డు సదుపాయం లేదని స్థానిక నాయకులు కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చారు. సమీపంలో ఉన్న రైతులతో మాట్లాడి రోడ్డుకు అవసరమైన భూమిని సేకరించాలని, ప్రత్యామ్నాయంగా వారికి వేరొక చోట ప్రభుత్వ భూమిని కేటాయిస్తామని చెప్పి ఒప్పించాలని తహసీల్దార్ అంబేద్కర్, గృహనిర్మాణ శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి రమాదేవి, డీటీ నీరజ, ఎంపీడీవో శ్రీనివాసరావు తదితర అధికారులు పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో మెరుగైన సేవలు అందించాలి

కలెక్టర్ నక్కపల్లి ఏరియా ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వార్డుల్లో పర్యటించి ఇన్‌పేషెంట్లతో మాట్లాడారు. వైద్య సేవల గురించి ఆరా తీశారు. ఫార్మసీ విభాగం, స్టోర్‌రూం, అత్యవసర గదులు, ఎక్స్‌రే ప్లాంట్ పరిశీలించారు. ఆస్పత్రిలో 24 గంటలు సేవలు అందించాలన్నారు. హెటిరో కంపెనీ యాజమాన్యం రోగుల కోసం మినరల్ వాటర్ ప్లాంటు ఏర్పాటు చేస్తోందని, ఆస్పత్రికి అల్ట్రా సౌండ్ స్కానింగ్ పరికరం సమకూరుస్తోందని కంపెనీ ప్రతినిధులు కలెక్టర్‌కు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, స్థానికులు కలెక్టర్‌ను కలిశారు. నక్కపల్లిలో ఏర్పాటు చేసిన డిగ్రీ కళాశాలకు స్థలం కేటాయించి నూతన భవనాలు నిర్మించాలని కోరారు.

త్వరితగతిన రోడ్డు సమస్యకు పరిష్కారం

ఎస్.రాయవరం: పెట్టుగోళ్లపల్లి గ్రామంలో వైఎస్సార్‌కాలనీ రోడ్డు సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గ్రామంలో గురువారం కలెక్టర్ పర్యటించారు. స్థానిక రైతులకు నచ్చజెప్పి రోడ్డుకు అవసరమైన స్థలం తీసుకోవాలన్నారు. సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి చిన్నారులతో మాట్లాడారు. ఓటరు జాబితా సవరణ సర్వే వివరాలు తెలుసుకున్నారు. సమగ్ర వివరాలు లేకుండా ఓటరు జాబితా నుంచి తొలగింపులు చేయరాదన్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీడీవో రామచంద్రమూర్తి, డిప్యూటీ తహసీల్దార్ శ్యామ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

పీజీ, పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయంతో సంయుక్తంగా బొల్లినేని మెడ్‌స్కిల్స్‌లో వివిధ పీజీ, పీజీ డిప్లమా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రవేశాల సంచాలకులు ఆచార్య డి.ఏ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. రెండేళ్ల కాలవ్యవధి కలిగిన మాస్టర్ ఆఫ్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్‌కు ఏదయినా డిగ్రీ పూర్తిచేసినవారు, ఏడాది కాల వ్యవధితో నిర్వహించే పిజీ డిప్లొమా ఇన్‌క్రిటికల్ కేర్ టెక్నాలజీ, పీజీ డిప్లొమా ఇన్ ఎమర్జెన్సీ మెడిసిన్ టెక్నాలజీ, పీజీ డిప్లొమా ఇన్ గ్యాస్ట్రోఎంట్రాలజీ టెక్నాలజీ కోర్సులకు ఎంబీబీఎస్, బీడీఎస్, బీఎస్సీ, బి ఫార్మసీ, బీఎస్సీ నర్సింగ్, బీఏఎంఎస్, బీహెచ్ఎంఎస్ కోర్సులు చేసిన వారు అర్హులు. హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ కోర్సులో 40 మందికి, ఇతర కోర్సులకు 15 మందికి ప్రవేశం కల్పిస్తారు. హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ కోర్సుకు ఏడాదికి రూ.45 వేలు ఫీజుగా, ఇతర కోర్సులకు రూ.50 వేలు కోర్సు ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది.

ఆసక్తి, అర్హత కలిగిన వారు సెప్టెంబర్ 8వ తేదీ లోగా తమ దరఖాస్తులను ప్రవేశాల సంచాలకుల కార్యాలయంలో అదజేయాలి. దరఖాస్తుతో పాటు సంబంధిత విద్యార్హత తెలిపే సర్టిఫికెట్లను జతపరచాలి. ఇతర వివరాలకు ప్రవేశాల సంచాలకుల వెబ్‌సైట్ www.audoa.in సందర్శించాలని సూచించారు. పూర్తివివరాలు 72079 53919, 76809 45357 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.



సంప్రదాయబద్ధంగా విద్యార్థినుల ఓనం సంబరాలు

కళా కేరళం

పాయకరావుపేట: కేరళ సంప్రదాయం కనువిందు చేసింది. ఓనం వేడుక ఆనందోత్సాహాలు నింపింది. కేరళ వస్త్రధారణలో విద్యార్థినులు ముగ్గులు వేసి, పూజలు చేసి, సంప్రదాయ నృత్యాలతో అందరినీ అలరించారు. శ్రీప్రకాష్ జూనియర్ కళాశాల ప్రాంగణంలో గురువారం ఈ కార్యక్రమాలు జరిగాయి. కళాశాల ప్రిన్సిపాల్ వి.వి.ఎస్.ఎస్.భానుమూర్తి, అకడమిక్ ఇన్‌చార్జి డి.శ్రీలక్ష్మి, ఉపాధ్యాయ బృందం పూజలు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రిన్సిపాల్ భానుమూర్తి మాట్లాడుతూ వివిధ రాష్ట్రాల సంప్రదాయాలు, పండగల గురించి విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్నామన్నారు.

పింఛన్ సొమ్ము దారిదోపిడీ

కళ్లలో కారం కొట్టి రూ.13.78 లక్షలతో మాయం



సంఘటన స్థలంలో విచారణ జరుపుతున్న నర్సీపట్నం ఏఎస్పీ అదిరాజ్‌సింగ్ రాణా

నక్కపల్లి: లబ్ధిదారులకు బట్వాడా చేసేందుకు తీసుకెళ్తున్న పింఛను సొమ్మును కొంతమంది దుండగులు దారి కాచి దోచుకున్న ఘటన నక్కపల్లి మండలంలో గురువారం జరిగింది. జానకయ్యపేట గ్రామంలో పాత పింఛన్లు 499, కొత్త పింఛన్లు12కు సంబంధించిన మొత్తం రూ.13.78 లక్షలు ప్రభుత్వం విడుదల చేసింది. సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ వెంకటేశ్వరరావు, డిజిటల్ అసిస్టెంట్ నానిబాబు కలిసి ఈ మొత్తాన్ని నక్కపల్లి ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకులో డ్రా చేసి వలంటీర్లకు అందజేసేందుకు మోటారు సైకిల్‌పై బయలుదేరారు. జాతీయ రహదారి నుంచి హెటిరో కంపెనీకి వెళ్లే జానకయ్యపేట రోడ్డులో కొంతదూరం వెళ్లాక దుండగులు సచివాలయ సిబ్బందిని అడ్డగించి, కంట్లో కారం కొట్టి నగదు ఉన్న బ్యాగులను తీసుకుని ఉడాయించారు. తేరుకున్న సచివాలయ సిబ్బంది లబోదిబోమంటూ వారి వెంట పరుగులు పెట్టినప్పటికీ వారు పక్కనే ఉన్న పొలాల్లో నుంచి పరారయ్యారు. దీనిపై సచివాలయ సిబ్బంది పోలీసులకు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బందికి ఫిర్యాదు చేశారు. సీఐ అప్పన్న, ఎస్ఐ శిరీష ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. దుండగుల కోసం గాలిస్తున్నారు.

క్లుప్తంగా

గుర్తు తెలియని వ్యక్తి మృతి



ఫుట్‌పాత్‌పై గుర్తుతెలియని మృతదేహం

అనకాపల్లి టౌన్: స్థానిక మెయిన్‌రోడ్డు ఎస్‌బీఐ ఎదురుగా 45 నుంచి 50 ఏళ్ల వయసు కలిగిన గుర్తుతెలియని వ్యక్తి ఫుట్‌పాత్‌పై అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. ఇక్కడ కొన్ని నెలలుగా భిక్షాటన చేస్తూ ఫుట్‌పాత్‌పై నిద్రిస్తుంటాడు. ఈ నేపథ్యంలో మృతుడికి సంబంధించి ఎటువంటి ఆధారాలు లేవు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయానికి పట్టణ పోలీసులు తరలించారు. మృతుడు సంబంధికులు వివరాలకు 9154879719 సంప్రదించాలని పట్టణ సీఐ దాడి మోహన్‌రావు సూచించారు.

పిడుగుపాటుకు ఎద్దు మృతి



మృతి చెందిన ఎద్దు

నాతవరం: మండలంలో మన్యపురట్ల గ్రామానికి చెందిన అప్పన్న చంటిబాబుకు చెందిన ఎద్దు గురువారం పిడుగుపాటుకు మృతి చెందింది. రోజూ మాదిరిగానే తన ఎద్దులను పొలానికి మేతకు తీసుకెళ్లాడు. ఈ క్రమంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఆ సమయంలో ఎద్దుపై పిడుగుపడటంతో అక్కడికక్కడే మృతిచెందింది. చంటిబాబు ఇటీవల రెండు ఎద్దులను రూ.1.80 లక్షలకు కొనుగోలు చేయగా, వాటిలో ఒకటి కళ్ల ముందే మృతి చెందడటంతో కన్నీరుమున్నీరుగా విలపించాడు.

రోడ్డు ప్రమాద బాధితులకు సత్వర న్యాయం



హోంగార్డు భార్య హైమకు కారుణ్య నియామకపత్రాన్ని అందిస్తున్న ఎస్పీ



జిల్లా ఎస్పీ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎస్పీ మురళీకృష్ణ, పోలీసు అధికారులు

అనకాపల్లి టౌన్ : సుప్రీంకోర్టు విధించిన మార్గదర్శకాలపై పోలీసు అధికారులు చర్యలు చేపట్టాలని డీజీపీ కె.వి.రాజేంద్రనాథ్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన పోలీసు అధికారులతో మాట్లాడారు. రోడ్డు ప్రమాదాల్లో మరణించిన, గాయపడిన బాధిత కుటుంబాలకు సకాలంలో పరిహారం అందించేందుకు కృషి చేయాలని సూచించారు. ఇటువంటి కేసుల విషయంలో దర్యాప్తు అధికారి మోటారు వాహన సవరణ నియమాలు 2022 ప్రకారం బాధితులకు త్వరితగతిన పరిహారం అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ 48 గంటల్లో మొదటి రిపోర్ట్, 50 రోజుల్లో ఇంటరిమ్ రిపోర్ట్, 90 రోజుల్లో ఫైనల్ రిపోర్టులను క్లెయిమ్స్ ట్రిబ్యునల్‌కు, బీమా కంపెనీకి, స్టేట్ లీగల్ సర్వీస్ అథారిటీకి కచ్చితంగా పంపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్, అదనపు ఎస్పీ (క్రైం) పి.సత్యనారాయణరావు, పరవాడ డీఎస్పీ కె.వి.సత్యనారాయణరావు, ఇన్‌స్పెక్టర్లు లక్ష్మణమూర్తి, చంద్రశేఖర్, ఎస్‌ఐ రమణయ్య, ప్రసాద్, భీమరాజు, వెంకన్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి బాసట

పెందుర్తి నియోజకవర్గం సబ్బవరం పోలీస్‌స్టేషన్‌కు చెందిన హోంగార్డు సబ్బవరపు కుమారస్వామి భార్య హైమకు దిశ హోంగార్డుగా నియామకపత్రాన్ని ఎస్పీ కె.వి.మురళీకృష్ణ గురువారం అందజేశారు. ఎస్పీకి ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు. జిల్లా పోలీసు కార్యాలయ పరిపాలన అధికారి బి.శారద, సీనియర్ అసిస్టెంట్ డి.భవాని పాల్గొన్నారు.

రాజన్నకు రాఖీ



రాఖీ పండగా సందర్భంగా ఆశీలమెట్టలోని వేమన మందిరం ఆవరణలో దివంగత నేత వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి 27 వార్డు మహిళా అధ్యక్షురాలు గొలగాని లక్ష్మి రాఖీ కట్టారు. ప్రతి ఏడాది రాజన్న విగ్రహానికి రాఖీ కడుతున్నట్టు ఆమె తెలిపారు. ఈకార్యక్రమంలో నందిని, మానస, గౌతమి, రత్నకుమారి, త్రిపుర పాల్గొన్నారు. - సీతమ్మధార(విశాఖ)

7 నుంచి నూకాంబిక ఆలయ పునర్నిర్మాణ పనులు



నూతన పాలక వర్గంతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఈవో బండారు ప్రసాద్

అనకాపల్లి టౌన్: గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి అన్ని వర్గాల ప్రజలు, కమిటీ సభ్యుల సహకారంలో ఈ నెల 7 నుంచి పనులు ప్రారంభిస్తున్నట్లు అమ్మవారి దేవస్థానం చైర్మన్ కొణతాల మురళీకృష్ణ తెలిపారు. గురువారం స్థానిక ఆలయంలో నూతన కమిటీతో ఆలయ ఈవో బండారు ప్రసాద్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రభుత్వం, మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆదేశాల మేరకు శక్తివంచన లేకుండా అమ్మవారి ఆలయ అభివృద్ధికి సహకరిస్తున్నట్లు పేర్కొన్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు దేశ, విదేశాల నుంచి భక్తులు తరలివస్తున్నారని, వారికి ఎటువంటి ఇబ్బందులు, అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. అమ్మవారికి ప్రీతికరమైన రోజుల్లో ప్రత్యేక అలంకరణ, నిత్యాన్నదాన భక్తులకు కావల్సిన మౌలిక సదుపాయాలు కల్పనకు అధిక ప్రాధాన్యమిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కంటపల్లి శోభారాణి, పీలా లక్ష్మి, పాము అనురాధ, మల్లవరపు ఈశ్వరరావు, ఆడారి ఉమాచంద్రమహేశ్వరి, బుద్ద నరసింగరావు, గొల్లవిల్లి నరసింగరావు, కొండూరు రవీంద్రనాథ్, ఎక్స్ అఫీషియో మెంబర్ వై.శ్రీనివాసరావు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీకొట్టిన మరో లారీ

చీపురుపల్లి డ్రైవర్‌కు తీవ్ర గాయం

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. ఎస్‌ఐ ఎ.ఆదినారాయణ రెడ్డి వివరాల ప్రకారం... యలమంచిలి నుంచి అనకాపల్లి వైపు వెళ్తున్న లారీ తాళ్లపాలెం సమీపంలో హోటల్ వద్ద ఆగింది. ఆ తర్వాత ముందుకు అకస్మాత్తుగా కదిలిన లారీని వెనుక నుంచి వచ్చిన మరో లారీ ఢీకొట్టింది. దీంతో వెనుక లారీ కేబిన్ దెబ్బతింది. దాని డ్రైవర్ విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలం రావివలస గ్రామానికి చెందిన నక్కా రమణ తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆత్మీయతానురాగాలతో రక్షాబంధన్



బొడ్డేడ ప్రసాద్‌కు రాఖీ కడుతున్న ఎంపీ సత్యవతి



దంతులూరికి విద్యార్థినుల రక్షాబంధన్

అనకాపల్లి టౌన్: అన్నాచెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల అనురాగ బంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పౌర్ణమి వేడుకలు జిల్లావ్యాప్తంగా గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎంపీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్‌కు ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి రాఖీ కట్టారు. ఏపీ ఇన్‌లాండ్ వాటర్ వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్‌కు ఆయన కార్యాయలంలో తుమ్మపాల ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులు రాఖీలు కట్టి ఆనందాన్ని పంచుకున్నారు.

రేపటి నుంచి జాతీయ సంగీత నాటకోత్సవాలు

మద్దిలపాలెం: జాతీయ సంగీత నాటకోత్సవాలు శనివారం నుంచి మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో నిర్వహిస్తున్నామని విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమి అధ్యక్ష్య, కార్యదర్శులు మంతెన సత్యనారాయరాజు, డాక్టర్ వీఆర్‌కే ప్రసాద్ తెలిపారు. గురువారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో బ్రోచర్ ఆవిష్కరించారు. ప్రముఖ వయోలిన్ విద్వాంసుడు అపర త్యాగరాజు పద్మశ్రీ డాక్టర్ అన్నవరపు రామస్వామికి నాద విద్యాభారతి పురస్కారం అందిస్తున్నట్టు ప్రకటించారు. జాతీయ పురస్కారంతో పాటు రూ.లక్ష బహుమతి అందిస్తున్నామన్నారు. మాజీ ఉప రాష్ట్రపతి డాక్టర్.ఎం.వెంకయ్యానాయుడు, నావికాదళ వైస్ అడ్మిరల్ జి.శ్రీనివాస్‌లు హాజరవుతారని తెలిపారు.

రోజుకు రూ.కోటి

- రైళ్ల రద్దు.. ఆర్టీసీకి రద్దీ..!
- బస్సుల్లో ఊపందుకున్న ప్రయాణికుల తాకిడి
- డిమాండ్ మేరకు దూరప్రాంతాలకు సర్వీసుల పెంపు
- 60 నుంచి 80 శాతానికి పెరిగిన ఆక్యుపెన్సీ రేషియో
- విశాఖ రీజియన్‌లో మెరుగుపడ్డ రాబడి
- భారీగా ఆదాయం



ద్వారకా బస్‌స్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

సాక్షి, విశాఖపట్నం : రైళ్ల రద్దు ఆర్టీసీకి కలిసొస్తోంది. కొంతకాలంగా రైల్వే శాఖ పలు రైళ్లను రద్దు చేస్తోంది. రైల్వే రూట్లలో ఇంటర్ లాకింగ్, ఆటో సిగ్నలింగ్, డబ్లింగ్, స్టేషన్ల ఆధునికీకరణ, రైలు పట్టాల మార్పిడి, మరమ్మతులు తదితర పనుల కారణంగా ఈ నిర్ణయం తీసుకుంది. విశాఖ మీదుగా, విశాఖ నుంచి విజయవాడ, హైదరాబాద్, తిరుపతి వైపు రాకపోకలు సాగించే 32కు పైగా ఎక్స్‌ప్రెస్, పాసింజర్ రైళ్లు రద్దయిన వాటిలో ఉన్నాయి. వీటిలో నిత్యం రద్దీతో నడిచే ప్రధాన రైళ్లు కూడా ఉన్నాయి. ఇలా దాదాపు నెల రోజుల నుంచి రైళ్ల రద్దు కొనసాగుతూనే ఉంది. దీంతో ఈ రైళ్లలో ప్రయాణించాల్సిన వారు ప్రత్యామ్నాయంగా బస్సులను ఆశ్రయిస్తున్నారు. అసలే నష్టాల్లో నడుస్తున్న ఆర్టీసీకి రైల్వే నిర్ణయం ఒకింత ఊరటనిస్తోంది. ప్రయాణికుల రద్దీతో పాటే బస్సుల్లో ఆక్యుపెన్సీ రేషియో కూడా (ఓఆర్) కూడా పెరుగుతోంది. ఆర్టీసీ విశాఖ రీజియన్‌లో నెల రోజుల క్రితం వరకు సగటున 60 శాతం ఓఆర్ ఉండగా ఇప్పుడది 80 శాతం, అప్పుడప్పుడు 90 శాతం వరకూ ఉంటోంది. ఇలా బస్సులు ప్రయాణికులతో ఫుల్ అయినప్పటికీ ఇంకా రద్దీ ఉంటే ఆర్టీసీ అధికారులు అందుకనుగుణంగా అదనపు సర్వీసులను నడుపుతున్నారు. సాధారణంగా విశాఖ రీజియన్ నుంచి విజయవాడకు, విజయవాడ మీదుగా వివిధ ప్రాంతాలకు 84, రాజమండ్రికి 24, హైదరాబాద్‌కు 4 సర్వీసులు నడుస్తుంటాయి. ప్రయాణికుల తాకిడి దృష్ట్యా ప్రస్తుతం విశాఖ నుంచి విజయవాడకు రాత్రి వేళ ఆరు, రాజమండ్రికి ఆరు, హైదరాబాద్‌కు మరో రెండు సర్వీసులను అదనంగా తిప్పుతున్నారు. ఇంకా ఇతర ప్రాంతాలకు అవసరమైతే నడుపుతున్నారు. మునుపటితో పోల్చుకుంటే ప్రస్తుతం ఆర్టీసీ బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్లు కూడా బాగానే జరుగుతున్నాయి. వీటికనుగుణంగా ఆర్టీసీ అధికారులు ప్రణాళికతో అదనపు బస్సులను సమకూరుస్తున్నారు. మరికొన్నింటిని సర్దుబాటు చేస్తున్నారు. మరోవైపు పది రోజుల నుంచి పెళ్లిళ్ల ముహూర్తాలు మొదలయ్యాయి. ఇలా రైళ్ల రద్దుతో పాటు పెళ్లిళ్ల సీజను మొదలవడం కూడా ఆర్టీసీలో ప్రయాణాలు సాగించే వారి సంఖ్య పెరగడానికి దోహదపడుతోందని ఆర్టీసీ విశాఖపట్నం జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.అప్పలరాజు 'సాక్షి'కి చెప్పారు.

ఆదాయమే..ఆదాయం

ఆర్టీసీ విశాఖ ప్రజా రవాణా విభాగానికి రోజుకు సగటున రూ.87 లక్షల ఆదాయం సమకూరుతుంది. ప్రస్తుతం అది రూ.95 లక్షలకు చేరుకుంది. కొన్ని రోజుల్లో దాదాపు రూ.కోటి వరకు వస్తోంది. రద్దయిన రైళ్ల పునరుద్ధరణ జరిగే వరకు ఆర్టీసీ బస్సుల్లో రద్దీ కొనసాగే అవకాశం ఉంది.

సీనియర్ వైద్యుల పోస్టుల భర్తీకి 8న ఇంటర్వ్యూలు

మహారాణిపేట: ఆంధ్ర వైద్య కళాశాల పరిధిలో సీనియర్ రెసిడెంట్స్ వైద్యులు (పీడ్రియాట్రిక్స్) పోస్టులను భర్తీ చేయడానికి నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ నెల 8న ఆంధ్ర వైద్య కళాశాల్లో ఉదయం 11 నుంచి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు తెలిపారు. కార్యక్రమానికి అభ్యర్థులు దరఖాస్తుతోపాటు హాజరు కావచ్చని గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

వివరాలన్నీ https://www.amc.edu.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి. ఆసక్తి గల అభ్యర్థులు 9848314843 నంబర్‌లో సంప్రదించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

టీడీపీ సర్పంచ్ సహా ఐదుగురిపై కేసు

బోగస్ పత్రాలతో భూమి కాజేశారని ఫిర్యాదు

మాకవరపాలెం: బోగస్ పత్రాలతో భూమిని కాజేశారంటూ ఇచ్చిన ఫిర్యాదుపై టీడీపీ సర్పంచ్ సహా ఐదుగురిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రామకృష్ణారావు గురువారం తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం.. మాకవరపాలెం మండలం తామరం రెవెన్యూ పరిధిలో తనకున్న భూమిని బోగస్ పత్రాలతో కాజేశారని కొమ్మోజు అప్పలాచారి ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు శెట్టిపాలెం సర్పంచ్ అల్లు రామునాయుడు, కడపకు చెందిన గిద్దలూరి వీరాస్వామి, విజయవాడకు చెందిన దలియా కామేశ్వరి, తామరం గ్రామానికి చెందిన కోసూరు శ్రీను, నైదాన సింహాద్రిలపై 420తోపాటు మరికొన్ని సెక్షన్లతో కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి రెవెన్యూ అధికారుల ద్వారా విచారణ చేస్తామని ఎస్‌ఐ తెలిపారు.

క్రికెటర్ ఈశ్వర్ ఇకలేరు

- ఆగస్టు 28న గుండెపోటుతో కన్నుమూత
- ఆలస్యంగా వెలుగులోకి..
- సపోర్టింగ్ స్టాఫ్‌గా పేరు ప్రఖ్యాతులు
- ఢిల్లీ క్యాపిటల్స్‌కు ప్రాతినిథ్యం



సచిన్‌కు టాటూ చూపుతున్న ఈశ్వర్(ఫైల్)

అక్కిరెడ్డిపాలెం/విశాఖ స్పోర్ట్స్: జీవీఎంసీ 68వ వార్డు గుడివాడ అప్పన్నకాలనీకి చెందిన క్రికెటర్ సోముదల ఈశ్వర్(40) కన్నుమూశారు. ఆగస్టు 28వ తేదీనే ఆయన గుండెపోటుతో మృతి చెందగా.. ఆలస్యంగా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఈ విషయం తెలిసిన క్రికెట్ అభిమానులు శోకసంద్రంలో మునిగిపోయారు. విశాఖలో డివిజన్ క్రికెట్ ఆడుతూనే ఈశ్వర్ అంచెలంచెలుగా ఎదిగాడు. ఏసీఏకు చేదోడు వాదోడుగా ఉంటూ.. టోర్నీల నిర్వహణలో సహాయం అందించేవాడు. అలా ఆయన ప్రతిభ ఐపీఎల్‌కు తాకింది. ఎడమ చేతి వాటం బౌలర్ అయిన ఈశ్వర్ ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్ బ్యాటర్లకు నెట్స్‌లో బంతులు విసిరేందుకు సహాయకుడిగా చేరాడు. ఐపీఎల్‌లో సపోర్టింగ్ స్టాఫ్‌గా ప్రస్థానం కొనసాగిస్తూనే.. విశాఖలో జరిగిన ఏపీఎల్ సీజన్‌లో పాల్గొన్నాడు. ఇటీవల ఏపీఎల్ సీజన్ ముగియడంతో అప్పన్నకాలనీలోని తన ఇంటికి చేరుకున్నాడు. ఈ నెల 28న స్నేహితులతో బయటకు వెళ్లి తిరిగి రాత్రి 8.30 గంటలకు ఇంటికి వచ్చాడు. బైక్ దిగి స్టాండ్ వేస్తుండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయాడని తల్లి రాములమ్మ తెలిపారు. ఆస్పత్రికి తరలించే లోపు మృతి చెందాడని బోరున విలపించారు. ఈ వార్త విన్న భారత క్రికెటర్ శ్రీకర్ భరత్.. ఈశ్వర్ ఇంటికి చేరుకుని ఆయన పార్థివదేహానికి నివాళులర్పించారు. కాగా.. ఈశ్వర్‌కు వివాహం కాలేదు.

క్రికెటర్ వేణుగోపాల్‌తో సాన్నిహిత్యం

తన 16వ ఏటనే క్రికెట్ ప్రపంచంలోకి అడుగుపెట్టిన ఈశ్వర్‌కు పేదరికం వెంటాడింది. 10వ తరగతి వరకు చదువుకున్న ఈశ్వర్ క్రికెట్టే ప్రపంచంగా భావించాడు. క్రికెటర్ వేణుగోపాల్, ఈశ్వర్ ఇద్దరూ రంజీ సెలక్షన్‌కు వెళ్లారు. వేణుగోపాల్ రంజీకి ఎంపిక కాగా.. ఈశ్వర్‌కు నిరాశే మిగిలింది. అయినా ఏనాడు కుంగిపోలేదు. ఈ క్రమంలో ఈశ్వర్‌పై అభిమానం పెంచుకున్న వేణుగోపాల్ తనతో పాటు పలు మ్యాచ్‌లకు తీసుకువెళ్లేవాడు. ఈశ్వర్ ఫాస్ట్ బౌలర్. గంటకు 150 కి.మీ. వేగంతో బౌలింగ్ చేసేవాడు. ఈశ్వర్ బౌలింగ్ అంటే భారత క్రికెటర్లకు ఎంతో ఇష్టం. అందుకే స్టార్ క్రికెటర్లు ఆయనతో బౌలింగ్ వేయించుకుని నెట్ ప్రాక్టీస్ చేసేవారు. దీంతో ఈశ్వర్‌కు ఎక్కువగా భారత క్రికెట్ క్యాంపుల్లో అవకాశం దక్కేది. అలా సచిన్ టెండూల్కర్, వీరేంద్ర సెహ్వాగ్, సౌరవ్ గంగూలీ, విరాట్ కోహ్లి, దినేష్ కార్తీక్, రికీ పాంటింగ్, డేవిడ్ వార్నర్.. తదితర ఎంతో మంది క్రికెటర్లకు అభిమానిగా మారాడు. ఈశ్వర్‌ను ఎక్స్‌ట్రా ప్లేయర్‌గా అన్ని విషయాల్లో సమానంగా చూసుకునే వారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈశ్వర్ మరణవార్త తెలుసుకున్న క్రికెటర్లు దిగ్భ్రాంతికి గురయ్యారు. తమ ప్రగాఢ సానుభూతిని కుటుంబ సభ్యులు తెలిపారు.

ప్రగాఢ సానుభూతి

మా అన్ని శిక్షణ సెషన్స్, మ్యాచ్‌ల్లో జట్టుకు సహాయకారిగా ఉన్న ఈశ్వర్‌ను మిస్ కావడం ఇప్పటికీ నమ్మలేకపోతున్నాం. మా ప్రియమైన సైడ్ ఆర్మ్ స్పెషలిస్ట్ ఈశ్వర్ ఇకలేరు. ఈ క్లిష్ట సమయంలో అతని కుటుంబానికి మా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాం.

-ఢిల్లీ క్యాపిటల్స్ మేనేజ్‌మెంట్

ఈశ్వర్ మృతి బాధాకరం

ప్రస్తుత సీజన్ ఐపీఎల్‌లో నేను ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకు ఆడాను. జట్టుతో పాటు ప్రాక్టీస్ చేసేప్పుడు ఈశ్వర్ నెట్స్‌లో బంతులు విసిరేవాడు. ఇద్దరం విశాఖ వాసులం కావడంతో తొలినాళ్ల నుంచి అతనితో పరిచయం ఉంది. అతను అకస్మాత్తుగా మృతి చెందడం బాధాకరం.

- భరత్, భారత టెస్ట్ క్రికెటర్

క్లుప్తంగా

జగనన్న పాల వెల్లువలో రుణ సౌకర్యం



జగనన్న పాల వెల్లువ సదస్సులో మాట్లాడుతున్న పశు వైద్యాధికారి అల్ఫ్రాన్సా జార్జి

కశింకోట: జగనన్న పాల వెల్లువ పథకం లబ్ధిదారులకు జిల్లా కేంద్ర సహకార బ్యాంకుల ద్వారా అందించే రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కశింకోట పశు వైద్యాధికారి అల్ఫ్రాన్సా జార్జి కోరారు. మండలంలోని తేగాడ, జోగారావుపేట గ్రామాల్లో అమూల్ డెయిరీకి పాలు సరఫరా చేస్తున్న రైతులతో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ నుంచి జగనన్న పాల వెల్లువ రైతులకు రూ.30 వేల వరకు రుణాలు అందించనున్నట్లు తెలిపారు. పాడి పశువుల కొనుగోలుకూ రుణాలు అందిస్తామన్నారు. జెట్టపురెడ్డితునిలో కూడా జగనన్న పాల వెల్లువ రైతులకు రుణాలు ఇవ్వడంపై కన్నూరుపాలెం పశు వైద్యాధికారి దయానా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్ కోన అరుణ, వైఎస్సార్ సీపీ నాయకుడు కోన నాగేశ్వరరావు, ఏఎంసీయూ ఆర్ఐసీ బి.గీతావాణి, ఏహెచ్ఏ అశ్విని, వీవోఏలు పాల్గొన్నారు.

స్థిరంగా కూరగాయల ధరలు

కశింకోట: స్థానిక వారపు సంతలో గురువారం టమాటా ధర మరింతగా తగ్గి దాదాపు సాధారణ స్థాయికి చేరుకుంది. కిలో రూ.30కి అమ్మకాలు సాగాయి. నాణ్యమైనది రూ.40కి విక్రయించారు. బంగాళాదుంప రూ.20, ఉల్లిపాయ రూ.30, దొండకాయ, క్యారెట్, బీట్రూట్, వంకాయ, గోరు చిక్కుడు రూ.40, బీరకాయ రూ.50, బెండకాయ, చేమదుంప, కాకర రూ.60, క్యాప్సికం రూ.80కి విక్రయాలు సాగాయి.

ఆనందోత్సాహాలతో రక్షాబంధన్ వేడుక

కశింకోట: మండల ప్రజలు రాఖీ పండుగను గురువారం ఆనందోత్సాహాలతో చేసుకున్నారు. అన్నాచెల్లెళ్ల అనురాగానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండగ సందర్భంగా సోదరుల ఇళ్లకు సోదరీమణులు సంప్రదాయంగా వెళ్లి, రాఖీలు కట్టి, మిఠాయిలు తినిపించి, ఆశీర్వాదం పొందారు. చిన్నవారికి ఆశీస్సులందించారు. రాఖీ సందర్భంగా కశింకోటలోని పలు దుకాణాల్లో రాఖీలు, స్వీట్ల అమ్మకాలు జోరుగా సాగాయి. బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు ఎక్కడ చూసినా తోపులాటలతో కళకళలాడాయి.

అనకాపల్లి సినిమాలు

మిస్టిక్ (ఉదయం, సాయంత్రం)	
బేబి (మ్యాట్నీ, రాత్రి)	: రాజా
ఏం చేస్తున్నావ్	: సత్యనారాయణ స్క్రీన్-1
ద ఈక్వలైజర్ 3	: సత్యనారాయణ స్క్రీన్-2
జైలర్	: షిర్డిసాయి
ఖుషి	: పర్తిసాయి
బెదురులంక 2012	: వెంకటేశ్వర
మిస్టర్ ప్రెగ్నెంట్	: శ్రీసత్య
ఖుషి	: రామచంద్ర

బెల్లం ధరలు

అనకాపల్లి మార్కెట్‌కు గురువారం 145 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,400	4,480
రెండో రకం	3,950	4,050
మూడోరకం	3,600	3,940

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 27 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-1 యూనిట్, బీ పాజిటివ్-12 యూనిట్లు, ఓ పాజిటివ్-12 యూనిట్లు, ఓ నెగిటివ్-1 యూనిట్, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 401 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 368 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

కొత్త తలారివానిపాలేనికి

నూతన సొబగులు

మండలంలోని గొలగాం పంచాయతీ కొత్త తలారివానిపాలెం గ్రామానికి కొత్త సొబగులు అద్దుకున్నాయి. రైతుల సేవకు రైతు భరోసా కేంద్రం(ఆర్బీకే), గ్రామస్తులకు మెరుగైన వైద్యాన్నందించేందుకు వెల్‌నెస్ సెంటర్లు అందుబాటులోకి రానున్నాయి. సొంత భవన నిర్మాణాలు పూర్తవడంతో మంత్రి గుడివాడ అమర్‌నాథ్ శుక్రవారం వీటిని ప్రారంభించనున్నారు.



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న రైతు భరోసా కేంద్రం నూతన భవనం

- నేడు ఆర్బీకే, వెల్‌నెస్ సెంటర్లకు ప్రారంభోత్సవం
- రూ.68 లక్షలతో అభివృద్ధి పనులు
- ఆనందోత్సాహాల్లో గ్రామస్తులు

అనకాపల్లిటౌన్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రామాల రూపురేఖలు మారుతున్నాయి. ప్రభుత్వ భవనాల నిర్మాణంతో అవసరమైన సేవలన్నీ అందుబాటులోకి వస్తున్నాయి. మండలంలోని కొత్తతలారివానిపాలెం గ్రామంలో రూ.68 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్, డ్రైనేజీ వ్యవస్థ ప్రారంభానికి నోచుకోనున్నాయి. దీంతో గ్రామ స్వరూపమే మారిపోనుందని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఊరు దాటాల్సిన పనిలేదు

కొత్తతలారివానిపాలెంలో రూ.22 లక్షలతో ఆర్బీకే భవనం, రూ.21 లక్షలతో వెల్‌నెస్ సెంటర్‌తోపాటు ఏళ్ల తరబడి పీడిస్తోన్న డ్రైనేజీ సమస్యను రూ.25 లక్షలతో పరిష్కరించారు. సీసీ డ్రైన్లను నిర్మించారు. మనబడి నాడు-నేడు, సచివాలయ సేవలతోపాటు ఇపుడు అదనంగా రైతులకు ఆర్బీకే, గ్రామీణ వైద్య సేవలకు వెల్‌నెస్ సెంటర్‌కు సొంత భవనాలు నిర్మించడంతో గ్రామం కళకళలాడుతోంది. గతంలో ఏ సమస్య వచ్చినా పట్టణాలకు పరుగులు తీయాల్సి వచ్చేదని, ఇకమీదట అలాంటి అవస్థలుండవని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సీఎం జగన్ ప్రభుత్వ పనితీరుకు జేజేలు పలుకుతున్నారు.

దశ తిరిగిన గ్రామాలు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాలుగేళ్లలో నియోజకవర్గంలోని గ్రామాల్లో విద్య, వైద్యానికి పెద్దపీట వేసింది. నాడు-నేడు ద్వారా సర్కారీ స్కూళ్లను ఆధునీకీకరించి, కార్పొరేట్ స్థాయి సౌకర్యాలు, బోధన అందిస్తోంది. విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, వెల్‌నెస్ సెంటర్ల ద్వారా గ్రామీణులకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి. దేశంలో ఏ ప్రభుత్వమూ చేయలేనంతగా రైతులకు అవసరమైన అన్ని సౌకర్యాలనూ ఆర్బీకేల ద్వారా గ్రామంలోనే అందిస్తోంది. సచివాలయాల ద్వారా ఇప్పటికే గ్రామస్థాయికి చేరిన ప్రభుత్వ సేవలు, ఆర్బీకే, వెల్‌నెస్ తదితర కార్యాలయాలకు సొంత భవనాల ఏర్పాటుతో నిరంతర సేవలకు భరోసా ఏర్పడింది.



నేడు మంత్రి చేతుల మీదుగా ప్రారంభోత్సవం కానున్న వెల్‌నెస్ సెంటర్

చెప్పలేని ఆనందం



మా గ్రామంలో ఆర్బీకే, వెల్‌నెస్ సెంటర్ వంటి ప్రభుత్వ సముదాయాలు ప్రారంభం కావడం ఆనందంగా ఉంది. వైద్యసేవలకు ఇప్పటి వరకు పక్క గ్రామంలో ఉన్న వెల్‌నెస్ సెంటర్‌కు వెళ్లాల్సి వచ్చేది. ఇపుడు ఆ తిప్పలు పడాల్సిన పనిలేదు. మరోవైపు ఆర్బీకే సొంత భవనంలో సేవలు ప్రారంభమైతే రైతులకు మరింత ప్రయోజనం కలుగుతుంది.

– డి.కల్యాణ్, స్థానికుడు

ప్రారంభానికి సన్నద్ధం



ఆర్బీకే, వెల్‌నెస్ సెంటర్ భవన నిర్మాణాలను శరవేగంగా పూర్తి చేశాం. మంత్రి ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు పనుల పురోగతిని పరిశీలించాం. బిల్లుల చెల్లింపుల్లో జాప్యం లేకపోవడంతో పనుల్లో ఎలాంటి ఆటంకం ఏర్పడలేదు. ఈ భవనాలతోపాటు, స్థానికంగా పూర్తి చేసిన డ్రైనేజీ వ్యవస్థను కూడా మంత్రి చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరగనుంది.

– నరసింహారావు, ఎంపీడీవో, అనకాపల్లి

అంగన్‌వాడీలకు ఎల్‌ఈడీ టీవీల పంపిణీ నేడు

అనకాపల్లిటౌన్: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు ఎల్‌ఈడీ టీవీలను పంపిణీ చేయనున్నట్లు ఎంపీపీ గొర్లి సూరిబాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక గుండాల జంక్షన్ జీవీఎంసీ కల్యాణ మండపం మేడపైన శుక్రవారం ఉదయం 10 గంటలకు వీటిని అందిస్తామన్నారు. మండల పరిషత్ నిధుల నుంచి మండలంలోని 84 అంగన్‌వాడీ కేంద్రాలకు వీటిని అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ విచ్చేయనున్నట్లు తెలిపారు. ఇక మీదట అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుకునే విద్యార్థులకు ఎల్‌ఈడీ టీవీల ద్వారా విద్యా బోధన చేయనున్నట్లు వెల్లడించారు. మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహకులు, గ్రామసర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు హాజరుకావాల్సిందిగా కోరారు.

కులవివక్ష లేని సమాజం అందరి లక్ష్యం

సబ్బవరం: ప్రజలంతా చట్టం దృష్టిలో సమానమేనని.. కులాల పేరుతో ప్రజల మధ్య తారతమ్యాలు ఉండకూడదని సీఐ పైడి రంగనాథం అన్నారు. మండలంలోని ఎల్లుప్పి గ్రామంలో పౌర హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీఐ మాట్లాడుతూ చట్టం దృష్టిలో దళితులు, ఉన్నత వర్గాలు అనే తేడా ఉండదన్నారు. కులవివక్ష లేని సమాజ నిర్మాణం మనందరి లక్ష్యం కావాలన్నారు. మరో ముఖ్య అతిథి తహసీల్దార్ బి.సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. దళితుల హక్కులు కాపాడేందుకు మనమంతా కృషి చేయాలన్నారు.



మాట్లాడుతున్న సీఐ రంగనాథం

తొమ్మిదేళ్ల తర్వాత తోడపెద్దు ఉత్సవం

- మునగపాకలో నేడు, రేపు వేడుకలు
- జిల్లా వ్యాప్తంగా 17 ప్రాంతాల నుంచి తోడపెద్దులతో పాటు సేవగరిడీల రాక

మునగపాక : మండల కేంద్రంలో ఈనెల 1,2 తేదీల్లో యర్ర వెంకయ్య తోడపెద్దు పాలుకొలుపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. తొమ్మిదేళ్ల తరువాత మునగపాకలో తోడపెద్దుకు పాలుకొలుపు నిర్వహించనున్నారు. మునగపాకలో పేరుగాంచిన యర్ర వెంకయ్య తోడపెద్దు పాలుకొలుపు కార్యక్రమం రెండు రోజుల పాటు భక్తి శ్రద్ధలతో నిర్వహించనున్నారు. శుక్రవారం సాయంత్రం 7 గంటల తరువాత పట్టాభి దాసుడు నమ్మి వరప్రసాద్ పర్యవేక్షణలో పాలుకొలుపు ఉత్సవం ప్రారంభమవుతుంది. 2వ తేదీన ఉదయం 5.29 గంటలకు తిరు పాలుకొలుపు వేడుక జరుగుతుంది. ఈ కార్యక్రమంలో జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన 17 సింహాద్రప్పన్న ఎద్దులతో పాటు సేవగరిడీలు రానున్నాయని నిర్వాహకులు తెలిపారు. 2వ తేదీన భారీ అన్న సమారాధన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.



పాలుకొలుపు నిర్వహించే ఆలయ మండపం (ఇన్‌సెట్) తోడపెద్దు

వీధి కుక్కల బెడద తొలగించరూ..

పరవాడ: మండల కేంద్రం పరవాడలో వీధికుక్కల బెడద రోజురోజుకూ పెరుగుతోంది. గ్రామస్తులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. వీధి కుక్కల బెడదను నివారించడానికి పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ వీధుల్లో గుంపులు గుంపులుగా సంచరిస్తున్న శునకాలతో మహిళలు, విద్యార్థులు రోడ్ల మీదకు రావాలంటే బెంబేలెత్తిపోతున్నారు. చిన్నపిల్లలు ఒంటరిగా రోడ్డుమీదికొస్తే చాలు వెంటబడుతున్నాయి. మాంసం, చేపల దుకాణదారులు ఇష్టానుసారంగా వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పడేయడం వల్ల వాటికి అలవాటు పడిన గ్రామ సింహాలు గ్రామాన్ని వీడి ఎక్కడికి వెళ్లకుండా తమ సంతతిని విస్తరిస్తున్నాయి. పరవాడలో వందల సంఖ్యలో వీధి కుక్కలు సంచరించడంతో స్థానికులు తరచూ వాటి బారిన పడి ప్రమాదాలకు గురవుతూ ఆస్పత్రుల పాలవుతున్నారు. దీనిపై గతంలోనే పలుమార్లు ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టి సారించి చర్యలు చేపట్టాలని పరవాడ వాసులు కోరుతున్నారు.



పరవాడ రోడ్డుపై సంచరిస్తున్న వీధి కుక్కలు

హిందీ ఉపాధ్యాయులకు శిక్షణ

మునగపాక: విద్యార్థులకు జాతీయ భాష హిందీ పట్ల మక్కువ కలిగేలా చూడాలని ఎంఈవో-2 శివనాయుడు కోరారు. తిమ్మరాజుపేట స్కూల్ కాంప్లెక్స్‌లో గురువారం హిందీ ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందీ మాట్లాడడం, రాయడంపై విద్యార్థుల్లో మరింత అవగాహన పెంచాలన్నారు. హిందీని కేవలం పరీక్షల్లో తక్కువ మార్కులతో ఉత్తీర్ణులయ్యే సబ్జెక్టుగా పిల్లలు భావించకుండా, రాజ భాషగా దాన్ని నేర్చుకునేందుకు వారిలో ఉత్సాహం నింపాలన్నారు. శిక్షణకు రీసోర్స్ పర్సన్లుగా శైలజ, రాజ్యలక్ష్మి, శ్రీనివాసరావు, అరుణ జ్యోతి వ్యవహరించారు. కాంప్లెక్స్ కో-ఆర్డినేటర్లు కర్రి లక్ష్మీనారాయణ, మద్దాల గోవింద, నూకేష్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కశింకోట: మండలంలోని నరసింగబిల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని మూడు గ్రామాలకు శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈపీడీసీఎల్ ఈఈ ఎస్.రామకృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జాతీయ రహదారిపై కండక్టర్ మార్పు, ఇతర మరమ్మతుల నేపథ్యంలో ఉగ్గినపాలెం, జమాదులపాలెం, పరవాడపాలెం గ్రామాల్లో ఇళ్లకు, వ్యవసాయ కనెక్షన్లకు నిర్దేశిత సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందన్నారు. వినియోగదారులు తమ సిబ్బందికి సహకరించాల్సిందిగా కోరారు.

'గడప గడపకు' నేడు

కశింకోట: స్థానిక 3వ సచివాలయ పరిధిలో శుక్రవారం ఉదయం 8 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరగనుందని ఎంపీపీ కలగా లక్ష్మి, ఎంపీడీవో వి.వి.రవికుమార్, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబులు గురువారం తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పాల్గొని ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తారన్నారు. అఫీషియల్ కాలనీ నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమం గోవిందరావు కాలనీ, కనకమహాలక్ష్మి వీధి, కోటదిబ్బ, విశ్వబ్రాహ్మణ వీధి, ఆళ్ల వారి వీధి ప్రాంతాల్లో కొనసాగనుందన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటారన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, ప్రజలు, అభిమానులు హాజరు కావాల్సిందిగా కోరారు.

డీఏ పునరుద్ధరణపై వీఆర్ఏల హర్షం



రాష్ట్ర వీఆర్ఏ సంఘనాయకులను కలిసి హర్షం వ్యక్తం చేస్తున్న లోవరాజు

ఎస్.రాయవరం : గ్రామ రెవెన్యూ సహాయకులుగా పనిచేస్తున్న తమకు సీఎం జగన్ మోహన్‌రెడ్డి తిరిగి డీఏను పునరుద్ధరించారని ఉమ్మడి విశాఖ జిల్లా ఏపీజీఈఈఎఫ్ వీఆర్ఏ నాయకులు కోరుబిల్లి లోవరాజు తెలిపారు. గతంలో వీఆర్ఏలకు ఇచ్చే రూ.300 రద్దు చేసిన విషయం సీఎం దృష్టికి తీసుకువెళ్లడంతో డీఏను అదనంగా రూ.200 పెంచి రూ.500 అందిస్తానని చెప్పారన్నారు. సీఎంకు వీఆర్ఏల తరపున ధన్యవాదాలు తెలిపారు.

కొనసాగుతున్న ఎన్‌సీసీ క్యాడెట్ల శిక్షణ శిబిరం



పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్న ఎన్‌సీసీ క్యాంప్

అచ్యుతాపురం(అనకాపల్లి): మండలంలోని ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్న ఎన్‌సీసీ ఐజీసీ ఎన్ఎస్‌సీ-23 క్యాంప్‌లో భాగంగా గురువారం టెంట్ ఫిచింగ్ పోటీలు నిర్వహించారు. ఆరు రోజులుగా నిర్వహిస్తున్న ఈ శిబిరంలో ఏపీ, తెలంగాణకు చెందిన 300 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు. క్యాంప్ కమాండెంట్ ఇంగ్లీసర్ పర్యవేక్షణలో ఎన్‌సీసీ ఏపీ, తెలంగాణ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ కమాండర్ వి.ఎం.రెడ్డి క్యాడెట్లు వేసే టెంట్ల తీరుని పరిశీలించారు. ఈ క్యాంప్‌లో ప్రతిభ కనబరిచిన వారిని నౌసేనా, రిపబ్లిక్ డే పెరేడ్‌లకు ఎంపిక చేస్తారని నిర్వాహకులు తెలిపారు. ఎన్‌సీసీ అధికారులు అరవింద్, తులసి, నాగేశ్, ఈశ్వరరావు పాల్గొన్నారు.

నేత్ర పర్వంగా మరిడిమాంబ జాతర



ఎంపీ సత్యవతి దంపతులను సత్కరిస్తున్న కోరుకొండ రాఘవ



జాతరలో కాళీమాత నేల వేషాలు

అనకాపల్లిటౌన్: పట్టణంలోని కోట్నివీధి మరిడిమాంబ అమ్మవారి జాతర మహోత్సవం గురువారం రాత్రి నేత్రపర్వంగా సాగింది. వేకువజామున అమ్మవారి మేలుకొలుపు సేవ, పంచామృతాభిషేకాలు, కుంకుమార్చనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జాతర సందర్భంగా అమ్మవారి ఊరేగింపు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అమ్మవారిని దర్శించుకునేందుకు ఆలయం వద్ద భక్తులు బారులు తీరారు. అమ్మవారిని ఎంపీ బీవీ సత్యవతి, విష్ణుమూర్తి దంపతులు, ఏపీ ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం కార్యదర్శి జాజుల రమేష్, పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజులకు ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికి, ప్రత్యేక దర్శనం చేయించారు. సాయంత్రం నేలవేషాలతోపాటు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

భోగలింగేశ్వర దేవస్థానం పాలక మండలి ప్రమాణ స్వీకారం

అనకాపల్లిటౌన్: ప్రభుత్వం కొత్తగా నియమించిన గవరపాలెం శ్రీ భోగలింగేశ్వర స్వామి ఆలయ పాలక మండలి కమిటీ సభ్యులతో దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ గురువారం ప్రమాణస్వీకారం చేయించారు. నూతన కమిటీ చైర్మన్‌గా ఆళ్ల నాగేశ్వరరావు, సభ్యులుగా సింగంపల్లి రాజేశ్వరి, కొణతాల అప్పాజీ, మెలిపాక దుర్గ, కాండ్రేగుల రాము, కొణతాల కృష్ణంరాజు, వానపల్లి తాతీలు, ఎక్స్ అఫీషియో మెంబర్‌గా పి.నారాయణరావులు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా చైర్మన్ నాగేశ్వరరావు మాట్లాడుతూ రానున్న కార్తీకమాసం నెలరోజులు ఆలయానికి వచ్చే భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. భోగలింగేశ్వరస్వామి దేవాలయం బ్రిటీషుకాలం నుంచి ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉందని, నూతన కమిటీ సహకారంతో ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, నూకాంబిక అమ్మవారి దేవస్థానం చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, పార్టీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, పార్టీ నాయకులు దాడి నారాయణరావు, విల్లూరి శివసూరి, జగన్మోహనరావు, గైపూర్ రాజు, ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



చైర్మన్ ఆళ్ల నాగేశ్వరరావు, కమిటీ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న శ్రీధర్

వరి నారు సంరక్షణకు సూచనలు

కశింకోట: వర్షా భావంతో ఎండుతున్న నారుమళ్లను కొంత కాలం కాపాడుకునేందుకు అధికారుల సూచనలు పాటించాలని జిల్లా వ్యవసాయ శాఖ ఏడీ ఎం.రామారావు రైతులను కోరారు. మండలంలోని బయ్యవరంలో సరైన వర్షాలు లేక ఎండిపోతున్న వరి నారుమళ్లను గురువారం ఆయన పరిశీలించారు. రైతులతో మమేకమయ్యారు. వరి నారు ఎండుపోతున్న తరుణంలో ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవడానికి ముందుకు రావాలని సూచించారు. రానున్న రోజుల్లో వర్షాలు పడే అవకాశం ఉన్నందున, నారుమళ్ల వేయడానికి ఇంకా సమయం ఉందని, రక్షణ చర్యల ద్వారా కొంత కాలం కాపాడుకోవాలని రైతులకు సూచించారు. 19-19-19 రకం ఎరువును లేదా మల్టీ కె ఎరువు 5 గ్రాముల్ని లీటర్ నీటిలో కలిపి నారుమడిపై పిచికారీ చేయాలన్నారు. ఇలా వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలన్నారు. నీటి సదుపాయం ఉన్న వారు నారుమడికి తడులు పెట్టాలన్నారు. దీనివల్ల నారుమళ్లు ఎండిపోకుండా కాపాడుకోవడానికి అవకాశం కలగనుందన్నారు. కార్యక్రమంలో ఏఈవో ఎ.శ్రీను, సిబ్బంది పాల్గొన్నారు.



బయ్యవరంలో ఎండిపోతున్న వరి నారుమళ్లను పరిశీలిస్తున్న రామారావు

దళిత కాలనీల్లో మౌలిక సౌకర్యాలకు కృషి

తుమ్మపాల: గ్రామాల్లో దళితులు నివాసముంటున్న కాలనీల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు సచివాలయ అధికారులు, పాలకులు కృషి చేయాలని డీవీఎంసీ సభ్యుడు రేబాక మధుబాబు కోరారు. అనకాపల్లి మండలం రేబాక గ్రామంలో గురువారం డీవీఎంసీ ఆధ్వర్యంలో నిర్వహించిన పౌర హక్కుల దినోత్సవం కార్యక్రమంలో ఆయనతో పాటు తహసీల్దారు పీవీఎల్ఎన్ గంగాధరరావు, సర్పంచ్ మార్పూరు సన్యాసమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేషన్ డిపో, సరకుల స్టాక్ రూమ్‌గా వినియోగిస్తున్న దళితవాడలో ఉన్న సామాజిక భవనాలను తక్షణమే ఖాళీ చేయాలన్నారు. కుల, ఇతర ధ్రువీకరణ పత్రాలను వేగంగా మంజూరు చేయాలని కోరారు. సచివాలయ అధికారులు తమ పనులు చేయలేదంటూ స్థానికులు మొర పెట్టుకున్నారు. దీనిపై తహసీల్దార్ మాట్లాడుతూ దళితుల సమస్యలను ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లామని, పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్ఐ రమేష్, హెడ్‌కానిస్టేబుల్ కొండయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.



రేబాకలో పౌర హక్కుల దినోత్సవంలో పాల్గొన్న అధికారులు

రత్నాకర్‌కు బ్రహ్మకుమారీల రాఖీ

అనకాపల్లి టౌన్: రాఖీ పౌర్ణమి పండగను పురస్కరించుకుని గురువారం స్థానిక రింగ్‌రోడ్డు దాడి క్యాంపు కార్యాలయంలో బ్రహ్మకుమారీలు శ్రీ విద్య, ప్రమీలలు వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్‌కు రాఖీలు కట్టారు. రత్నాకర్ స్థానిక కోట్నివీధిలోని మరిడిమాంబ అమ్మవారిని దర్శించుకున్నారు. గవరపాలెం నిదానందొడ్డిలో శ్రీ కామాక్షమ్మ అమ్మవారిని శ్రావణ శుద్ధపౌర్ణమి సందర్భంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. చిన రాజుపేట చావల బజార్ వద్ద శ్రీ చౌడేశ్వర సాంబ శివస్వామి నూతన మండపం గృహప్రవేశం సందర్భంగా స్వామివారిని దర్శించుకుని, అక్కడ అన్నసమారాధన కార్యక్రమాన్ని రత్నాకర్ ప్రారంభించారు.



దాడి రత్నాకర్‌కు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీలు శ్రీవిద్య, ప్రమీల

నిత్యావసరాల ధరలు తగ్గించాలి

కశింకోట: నిత్యావసర సరకుల ధరలు తగ్గించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో గురువారం కశింకోటలో సంతకాల సేకరణ జరిపారు. సీపీఎం సమర భేరి కార్యక్రమంలో భాగంగా ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేశారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణ విధానాలను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని సీపీఎం నాయకుడు దాకారపు శ్రీనివాసరావు కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తాతబ్బాయి, వెంకటరావు, నాగేశ్వరరావు, వై.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



కశింకోటలో కర పత్రాలు పంపిణీ చేస్తున్న సీపీఎం నాయకుడు దాకారపు శ్రీనివాసరావు